కథా నిలయం
6063
శ్రీకాకుళం

# సరస్వతీ నమస్తుభ్యం

ఓరగా వేసివున్న వీధి తలుపు తీసుకొని లోపలకి వచ్చాడు భాస్కర్. అతని కళ్ళు అర్థాంగి కోసం వెతికాయ్. టి.వి చూస్తూనో, పుస్తక పఠనంలోనో, కుట్లు అల్లికలతోనో, కొత్తరకాల వంటల ప్రయోగాలతో ఇల్లు ఘుమఘుమలాడిస్తూనో హడావిడిపడిపోయే శ్రీమతి "ఊహు ఈ వేళకూడా నిస్తేజంగానే వుందన్న మాట. బెడ్‌రూం వైపు నడిచాడు. నిస్సత్తువుగా మంచం మీద ఒరిగి నిద్రాదేవి కటాక్షం కోసం విఫల ప్రయత్నం చేస్తోంది. గలగలపారే సెల ఏరులా, తానే ఓ చైతన్య స్రవంతిలా, రూపుకట్టిన ఉత్సాహంలా దూసుకుపోయే తన సరస్వతియేనా ఇప్పుడిలా! ఇంతోటి ఏం జరిగిందని? చప్పున ఆమె దగ్గరెకెళ్ళి బుగ్గన చిటికేశాడు. ఉలిక్కిపడింది. "అరే! ఎంతసేపైందండీ మీరు వచ్చి! టీ కలిపి ఫ్లాస్క్‌లో వుంచాను తీసుకొస్తాను" లేవబోయింది.

"క్షణంలో నేనే తెస్తాగానీ! నువ్వేమిటిలా, అమూల్యమైన నిధేదో పోగొట్టుకున్నట్టు".

"కాదండీ లక్ష్మీ ఇంత మొండికేస్తుందనుకోలేదు".

"సరే! ఇంకావిషయం వదిలేస్తావా! నేనప్పుడే చెప్పాను. మంచికి పోతే చెడు ఎదురొస్తుందని. నువ్వే చెవిని పెట్టావు కాదు. "అయ్యిందేదో అయ్యిందిలే ! ఇంక నీ మనస్సులోంచి దాని తలపులు తుడిచేయ్. స్వీట్ హోం లాంటి మన సంసారంలో అదెవరోయ్" అంటూ భార్యకు టీ అందించాడు.

కొత్తగా కొనుక్కున్న మువ్వల పట్టీలు గలగలలాడించుకుంటూ రివ్వున దూసుకొచ్చింది జ్యోతి. చేతుల్లో ఉన్న బుజ్జిగాడు ఆ మువ్వల రవళితో వాడి నవ్వులు శృతి కలుపుతున్నాడు.

"చూశారా ఆంటీ... బుజ్జిగాడ్ని నేను చిటికెలో చేరిక చేసేసుకున్నాను". అంది కళ్ళు తిప్పుతూ.

"అవును మరి మా జ్యోతి బంగారు తల్లి".

ఆ పాప చేతుల్లోంచి తన బాబును అందుకుంటూ మెచ్చుకోలుగా అన్నాడు. "వస్తా అంకుల్".

టీ.వి.లో నా కిష్టమైన సీరియల్ మొదలయ్యే టైమైంది. 'బై. ఆంటీ' అనేసి వచ్చినంత హడావిడిగానూ పరిగెత్తింది.

" ఏమిటోనండి, లక్ష్మీ నా నెత్తిన జెల్లకొట్టిపోయింది. ఇన్ని అవస్థలు. ఇంట్లో కూర్చోపెట్టి బొమ్మలతో ఆడించవే అంటే వినిపించుకునేది కాదు. పొద్దస్తమానం ఎత్తుకు తిప్పేది. బాగా ఎత్తు మరిగాడు. మధ్యాహ్నమంతా గుక్కపెట్టి ఒకటే ఏడుపు, జ్యోతి తీసికెళ్ళి ఆడించబట్టి సరిపోయింది. లక్ష్మిని మనం చేరదీసి చదువు సంస్కారం నేర్పిస్తే దాని భవిష్యత్తు బాగుపడుతుంది. అది నాకు కాస్త చెయ్యాసరఅవుతుంది. అనుకున్నాను" మోసపోయానండీ! నా అంచనా తలక్రిందులయింది.

సరస్వతికి, కమలమ్మ బాగా పరిచయం. అయిదో తరగతిదాకా తనతో కలిసి చదివింది. చదువంటే దానికి వల్లమాలిన ఇష్టం. ఇంటి దగ్గర అమ్మా- నాన్నల మధ్య కొట్లాటలు, అన్నయ్యల అల్లరి - చిల్లరి పనులు, అమ్మ తను పస్తులుండి అన్నయ్యలను తనను కూడా పస్తులుంచటం, ఏది ఎలా జరుగుతున్నా తన మనసు మాత్రం చదువు మీద లగ్నం చేసేది. అప్పట్లోనే కమలమ్మంటే సరస్వతికి జాలి. చదువు మానిపించేసిన రోజైతే అది ఎంత ఏడ్చిందో. పాతికేళ్ళు గడిచినా ఇప్పటికీ మరుపు రాదు సరస్వతికి. సరిగ్గా సంవత్సరం క్రితం ఓ పెళ్ళిలో కమలమ్మని కలిసింది సరస్వతి.

తనకు అప్పుడే పెళ్లి చేసేశారనీ తన మొగుడు మామనుమించిన అల్లుడని అప్పట్లో అమ్మకంటే ఇప్పుడు తను మరింతగా హింసించబడుతుందని, ముగ్గురు పిల్లల్ని కనిపారేశాడు కానీ, ఇల్లే పట్టదని తన కథంతా చెప్పుకొచ్చింది.

కమలమ్మ ఇప్పటికీ చదువు పట్ల ఆసక్తి మాయలేదు. సరస్వతికి కమలమ్మ పట్ల జాలీ తరగలేదు. ఆ పూటంతా తను కమలమ్మని వదలలేదు. సాయంత్రానికి ఓ నిశ్చయానికి వచ్చినదానిలా" పద మనం మీ ఇంటికెళదాం" అంది. కమలమ్మ నమ్మలేనట్లు చూసింది.

"ఏం నేను మీ ఇంటికి రాననుకుంటున్నావా! ఇందాకట్నుంచీ చూస్తున్నాను. చిన్ననాటి మన స్నేహాన్ని ప్రక్కన పెట్టేశావ్.

"నేనేం చేశానమ్మగారు"

"అదే, అదే చేస్తున్నావ్. ఆ అమ్మగారు మానేసి సరూ! అనవే. "ఎంత మాటమ్మ ! మీరు

గొప్పవాళ్ళు అలా ఎలా పిలవను. మీరెంతగా అభిమానించినా నేను పనిపాటలు చేసుకునేదాన్నేగా! మీ అంత ఎత్తుకు మేం ఎదగ్గలమా! " కమలమ్మ మాటల్లోనే కమలమ్మ ఇల్లు వచ్చింది. ఎంతో హైరానా పడిపోతూ సరస్వతికి అతిథి మర్యాదలు చేసింది "దండం పెట్టుకోండ(్రా కు(్రవెధవల్లారా! దేవతలాంటి అమ్మగారు. ఈ అమ్మదీ నాది చిన్ననాటి బడి స్నేహం." అంటుంటే సరస్వతికి నవ్వొంచింది. " ఏవే! ఇప్పుడు మనం స్నేహితులం కాదంటావా!" ఇంత పెద్ద మనసుతో మీరభిమానం చూపిస్తూ ఉంటే కాదని ఎలా అనగలను"?

తల్లి మాట పూర్తి కాకుండానే లక్ష్మి అందుకుంది.

"అమ్మ మిమ్మల్ని రోజూ తలుస్తుందాంటీ. మీ చిన్నప్పటి ముచ్చట్లు కథలు కథలుగా చెపుతూనే మమ్మల్ని పెంచింది". "ఈ వేళ నిజంగా మంచిరోజు. నాప్రియ స్నేహితురాల్ని కలిశాను. నిన్నూ, మీ అన్నయ్యలని చూశాను". లక్ష్మి చేసిపెట్టిన ఉప్మా ఆప్యాయంగా తింటూ అంది సరస్వతి. తరువాత తన అభిప్రాయం కమలకు చెప్పింది.

"ఏమంటున్నారమ్మా! నా లక్ష్మిని మీ ఇంట్లో ఉంచుకొని చదువు చెప్పిస్తారా, దానికి అంత అదృష్టమా! ఈ ఇంట్లో దీని బతుకు దినదిన గండంగా వుంది. దీని కోసం మా మామతో రోజూ పోట్లాటే."

" ఏమంటాడేంటీ? బంగారుబొమ్మలావుంది. పనిమంతురాలని తెలుస్తూనే వుంది."

"అదేనమ్మా- వాడి గొడవ. రోజుకో పనికి మాలిన కుర్రాడ్ని పట్టుకొస్తాడు. దీన్ని కట్టపెడదాం అంటాడు. ఎలా కుదురుతుందమ్మా. పెళ్ళంటే మాటలా. వాళ్ళు వీడికేదో ఆశ చూపిస్తారు. పిల్లనిచ్చేద్దాం అంటుంటాడు. ఇది మొత్తుకుంటుంది." ఇప్పుడే పెళ్ళొద్దు చదువుకుంటానమ్మా" అని.

"కొంత కాలం పిల్ల మామ కళ్ళముందు లేకుంటే పిచ్చి పిచ్చి వేషాలు మానేస్తాడు. ఆ పుణ్యం చెయ్యండమ్మా ! నా తల్లికైనా కాస్త చదువబ్బితే దాని బతుకైనా బాగుపడుతుంది. అదీ నేను ఎప్పటికీ మీకు ఋణపడి ఉంటాం". సరస్వతి చేతులు కళ్ళకద్దుకోబోయింది.

"పిచ్చిదానా! ఇందులో నా స్వార్థం లేదు. చకచకా పిల్ల ఇంట్లో తిరుగుతుంటే బుజ్జిగాడ్ని సునాయాసంగా పెంచగలను నువ్వు సాధించలేకపోయాననంటున్న విద్య, ధనం నా దగ్గరుంది. స్థితి మంతురాల్నే. నా జీవింతలోనూ వెలితిలేదు ఈ బంగారు తల్లి నాకు తోడుగా వుంటే నా ఈ అవిటితనంతో అయినా కాలాన్ని హాయిగా నెట్టుకు రాగలుగుతాను."

"అవేం మాటలమ్మా మీరేం చెప్పినా చేస్తుంది. ఇక నుండి లక్ష్మి మీ బిడ్డే" లక్ష్మి చేతులు సరస్వతి చేతుల్లో పెట్టి ఆనందభాష్పాలతో అంది కమలమ్మ.

సరస్వతి అలానే చూసుకుంది. దాన్ని తనతో తీసుకొచ్చిన మరుక్షణం నుంచి పంచప్రాణాలు ఆ పిల్లమీదే. లక్ష్మి ఆరవ తరగతి చదివింది కనుక దాన్ని హైస్కూల్లో చేర్చటం ఏమంత కష్టం కాలేదు.

ఆ పిల్ల తీరుని వెంటనే భాస్కర్ పసికట్టాడు. "తొందరపడ్డావు సరూ! నేలకి పోయేది నెత్తికెత్తుకున్నట్టు ఇవన్నీ మనకెందుకు" అన్న భర్తను వారించింది.

"మీదంతా విపరీత ధోరణే" లక్ష్మి ఇంటికొచ్చాక నాకెంత సంతోషంగా ఉందో. నాకు పనిలో అది సహాయపడుతుండ బట్టే కదా మీకు వేళకు టిఫిను, భోజనం, మీరే మాత్రం అవస్థపడకుండా అమర్చగలుగుతున్నాను. కర్ర ఊతతో కాళ్ళీడ్చుకుంటూ నేను చేయగలిగే పనులెన్ని, మీరు సుఖపడేదెంత"

"ఈ లక్ష్మిని నువ్వెంటేసుకుని రాక ముందు కూడా నా సుఖానికేం తక్కువ లేదు. అయినా నీకు వంటిట్లో సహాయపడటం అవసరావసరాల్లో మన బుజ్జిగాడి పనులు చేయటం నేనేం అవస్థలుగా అనుకోలేదే! మనసారా నిన్ను అర్ధాంగిగా చేసుకున్న రోజునుండి నీ లోపం నీకు గుర్తురానివ్వకుండా, నా పూర్తి సహకరం నీ కుండాలి అనుకున్నాను అలానేచేస్తున్నాను. మాటి మాటికీ మారుతున్నరనే మాటేగాని గిన్నెలు తోమి ఇల్లు నీటుగా చేయడానికి, బుజ్జిగాడ్ని ఆడించటానికి ఓ పని మనిషి ఉంటూనే ఉందిగా!"

"అబ్బబ్బ... ఇంకాపుతారా! లక్ష్మి వింటే నొచ్చుకుంటుంది. పనిమనుషులతో పోలుస్తారేంటండీ మా లక్ష్మిని. అది నా ప్రియ స్నేహితురాలి కూతురు.

భాస్కర్ మరి మాట్లాడలేదు.

హు... పిచ్చిసరూ!. ఎంత నిండుమనసుతో ఆదరిస్తోంది. అదే మోస్తరు భావన లక్ష్మికీ వుంటే ఆ పరిస్థితి వేరు. నిద్ర మంచం మీద నుండి లేచింది మొదలు అదీ... దాని ముస్తాబు, తిండి, స్నేహితులు, చదువు ఇంతే తప్ప సరస్వతికి ఏ మాత్రం సాయపడుతోందని. లక్ష్మిని తోడు తెచ్చుకున్నానన్న ఆనందంలో పనులన్నీ తనే చేసుకుంటోంది. గడుసరి గనుక బుజ్జిగాడ్ని కాసేపు ఎత్తుకునో, ఇల్లు సర్దుతున్నట్టో, సరస్వతి కళ్ళకేదో పనిచేస్తున్నట్టే కనిపిస్తోంది "ఎందుకిలా చుట్టు చుట్టూ తిరుగుతావే పిచ్చిమొహమా! ఇలా అయితే నీ చదువు ఎలా సాగుతుంది. కూరగాయలు నేను తరిగేస్తాలే. ఈ స్టూలు మీద కూర్చుని ఆ నాలుగు గిన్నెలు మెల్లగా నేను తోమేసుకుంటాలే. ఆ టిఫినేదో నే చేసేస్తాలే, వంటేముంది, కుక్కర్లో ఇట్టా అయిపోదూ! ఇలా ప్రతి పనీ తానే

చేసుకోవలసి వస్తోంది." "పాపం ఇది బాగా చదువుకోవాలండీ. వాళ్ళమ్మ కోరిక, దీని పట్టుదల కూడా అదే". అంటుంటుంది. " తను కాదనడు శ్రద్ధగా చదువుకోవడం మంచిదే. కానీ, ఆ అవకాశం కల్పించి అభిమానిస్తున్న వాళ్ళంటే ఎంత గౌరవం. మరెంతో పూజ్యభావం ఉండాలి. అవే ఉంటే సరస్వతిని ఇంత శ్రమ పెడుతుందా! స్కూలు వేళ అయ్యే వరకు ఎక్కడ పనులు అక్కడే ఉంచుతుంది సరస్వతి చొరబడేసరికి అదీ తయారవుతుంది. దాన్ని వారించి అన్ని సరస్వతే ఎలాగూ చేస్తుంది కదా అని.

ఆలోచించే కొద్దీ కంపరంగా ఉందతనికి. మొన్నటికి మొన్న తనేమన్నాడు " అంత సేపు అద్దం ముంచు నిలబడకపోతే బుజ్జిగాడికి స్నానం చేయించేసి, ఇల్లూడ్చి ఆ అంట్ల గిన్నెలేవో తోమేయొచ్చుకదా!"

ఆ మాటకే కస్సుమంది.

"నేనేం ఊరికే కూర్చోటం లేదు. నాకు, టైమున్నంతలో పనులు చేస్తూనే ఉన్నగా! బట్టలు ఉతికి, బుజ్జిగాడ్ని ఎత్తుకుని రోజు నా చేతులు లాగేస్తున్నాయ్. అసలు మా అమ్మ నాకిన్ని పనులు చెప్పేది కాదు!

విస్తుపోయాడు. ఇది ఇలా ఆలోచిస్తోందా! సరస్వతి ఎంత నిస్వార్థంగా దీన్ని చేరదీసింది. నాలుగు మెతుకులు వంట బట్టే సరికి కళ్ళు నెత్తికెక్కాయి ఈ పిల్లకి.

ఈ చేదునిజం సరస్వతి తెలుసుకున్నరోజు నిష్కల్మషమైన ఆ మనసు ఎంత ఆవేదనకు గురౌతుంది? భాస్కర్ తలపట్టుకున్నాడు. అతననుకున్న ఆరోజు రావడానికి ఎంతో కాలం పట్టలేదు. లక్ష్మి స్కూలునుండి సరాసరి తండ్రిని వెంటపెట్టుకొని వచ్చింది.

ఇతనెందుకు దిగబడ్డట్టు? అయినా తమ ఇంటికి రాకురిడా స్కూలుకెళ్ళటమేంటి. సరస్వతి ఆలోచనలు సాగుతూ ఉండగానే చెప్పవలసిన నాలుగూ చెప్పేశాడు.

లక్ష్మి తండ్రి వెనకాల నిలబడి తనవైపు నిర్లక్ష్యంగా చూస్తోంది. సరస్వతికి అంతా అయోమయంగా వుంది.

అయితే ఈ పిల్ల తండ్రికి ఉత్తరం రాసిందన్నమాట. తన ఆశయం ఒకటి. ఈ అమ్మాయి అనుకుంటున్నది ఒకటి. ఇన్నాళ్ళు చదివి పరీక్షలు కూడా రాయనంటుందా నీ కూతురూ"? కాస్త గట్టిగా అంది.

ఏంటమ్మా అది రాసేది? ఇక్కడకి దీన్ని తీసుకొచ్చింది చదువు చెప్పించటానికా? ఇంటెడు చాకిరి చేయించటానికా? పొద్దస్తమానం నీ కొడుకును ఎత్తుకొని మోయడానికే సరిపోయె. నా పెళ్ళాం ఎర్రి బాగుల్ది కనుక నమ్మి నీకూడా పంపింది". కనకారావ్ ఉరిమి సరస్వతినే చూస్తూ అన్నాడు.

ఆ చూపులు, వాడి నిష్ఠూరపు మాటలు తట్టుకోలేని సరస్వతి."ఏవే లక్ష్మి, నువ్వేం పనులు చేశేసావే. పగలంతా స్కూలేనాయె. సాయంత్రాలు నిన్ను దగ్గర కూర్చోబెట్టుకొని చదువు చెప్పానా? లేక ఇంటి పనులు చేయమన్నానా? నిజంగా నిన్నెప్పుడైనా పని మనిషిలా చూశానా నేను? సొంత బిడ్డలా చూస్తుంటే మీ నాన్నకేం రాశేవే ? నా మీద మండి పడుతున్నాడు.

లక్ష్మి నోరు విప్పింది.

"నా బాధ నాన్నకు కాక ఎవరికి రాస్తాను. అమ్మైతే మిమ్మల్నే వెనకేసుకొస్తుంది. నేనిక్కడ వుండలేను. నాన్నతో వెళ్ళిపోతాను. మీకే... మీరిక్కడుండి చదువుకోమనే అంటారు. ఎందుకంటే బుజ్జిగాడు పెద్దయ్యేవరకు సాయం మీకు కావాలి. వాడు పరిగెడితే మీరు పట్టుకోలేరు. ఎత్తుకొని అన్నం తినిపించలేరు. ఇలా ప్రతీ దానికి నా అవసరం మీకుంది. ఇదంతా నా కోసమే అన్నట్టు మాట్లాడకండి. నన్ను చదివిస్తున్నారన్న మిషతో మీకు దర్జాగా గడచిపోతోంది."

క్యాంప్ నుండి అప్పుడే వచ్చిన భాస్కర్ పరిస్థితి గమనించాడు. "ఏమిటే నోటికొచ్చినట్టు వాగుతున్నావ్. నువ్వు లేకపోతే మా దర్జాలకేం లోటురాదు. "పిట్టకొంచెం కూత ఘనం అని ఏదో నిన్ను చేరదీసి చదువు సంస్కారం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్దాలనుకున్న అమాయకురాలి మీదనా నిందవేస్తున్నావ్ వెళ్ళవే... తక్షణం మీ నాన్నతో వెళ్ళిపో. కాలమే నీతప్పు నీకు తెలియచేస్తుందిలే." ఆవేశంగా అనేసి తనే వాళ్ళని తరిమి వేసినంత పని చేశాడు భాస్కర్.

తన అర్ధాంగి మాత్రం ఈ షాకు నుంచి తేరుకోలేపోతుంది. తనకి నచ్చచెప్పడం అతడికి సాధ్యం కావడం లేదు.

బుజ్జిగాడిని భుజాన వేసుకొని జోకొట్టి నిద్ర పుచ్చుతున్నాడు భాస్కర్. " స్వచ్ఛమైన నా అభిమానానికి కళంకాన్ని అంటగట్టింది కదండీ నన్ను నా అవిటి తనాన్ని ఎంత అవమానించిందీ! చూశారా! తలచుకుంటున్న కొద్దీ దుఃఖం వచ్చేస్తోందండీ". కర్ర ఊతతో వంట ఇంటి వైపు కదులుతూ బేలగా మరోసారి అంది సరస్వతి. ఈ సారి భాస్కర్ భార్యని తీక్షణంగా చూశాడు.

"ఇదిగో సరస్వతి... మళ్ళీ ఆ లక్ష్మి ఊసెత్తినా, దాన్ని గురించిన ఆలోచనతో నీ మనసు పాడుచేసుకున్నా నా మీద ఒట్టే.." విసురుగా దగ్గరకెళ్ళి భార్య చేయి పట్టుకొని చప్పున తన తలపైన వేసుకున్నాడు.

సరస్వతి అదిరిపడింది. "అంత మాట ఎందుకండీ" అంటూ భయంగా తన చేయి తీసేసుకుంది.

"కాకపోతే ఏమిటి సరూ! ఇప్పుడు నష్టపోయేది నువ్వుకాదు. బంగారంలాంటి భవిష్యత్తును కాలదన్నుకున్నది ఆ పిల్లే. అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగుతుందన్న సామెత ఇలాంటి వాళ్ళకే వర్తిస్తుంది. ఆ లక్ష్మిది చంచలమైన మనస్సు కనుకనే చదువు మీద నిలవలేదు. దానికి మనమేం చేస్తాం. భర్త మాటలు ఆమెకు ఊరట కల్గించాయి.

***

మళ్ళీ ఆ ఇంటి తలుపు తట్టాలంటే లక్ష్మి చేయి కంపించింది. కాని తన బ్రతుకులో ముసురుకున్న పెనుచీకటి తొలగిపోవాలన్నా తన జీవితానికి సరైన దారి ఏర్పడాలన్నా, ఈ

ఆలయంలో అడుగుపెట్టి దేవతలాంటి ఆ తల్లిని క్షమాపణ వేడవలసిందే. ఆ నిశ్చయంతోనే తిరిగి ఇక్కడకొచ్చింది. తీరా ఏదో జంకు. ధైర్యం కూడ దీసుకుంది. తలుపు తట్టిన శబ్దానికి వాడెత్తుకున్న చెల్లాయితో సహా పరుగెత్తి వచ్చి తలుపు తీసిన బుజ్జిగాడ్ని చూసింది. "నువ్ బుజ్జివి కదూ! ఈ పాప నీ చెల్లాయా?" వాడి చేతుల్లోవున్న పాపనందుకోబోయింది. అన్నయ్యని మరింత హత్తుకుపోయి ఏడవటం మొదలుపెట్టింది. "పాప ఇదేమిటే ఎవరిదగ్గరకైనా ఉరికురికి వెళ్తావు ఈ ఆంటీ ఎత్తుకుంటాననంటే ఏడుస్తున్నావేం, చెల్లాయ్."

"అదంతేలేబాబు. పసిపిల్లలకు దేముడన్ని చెప్పేస్తాడు మీ చెల్లి నా దగ్గరకి రాదులే."

"అదే వస్తుందాంటీ. నిలబడే మాట్లాడుతున్నారు. ముందు మీరు లోపలకు పదండీ. మీకెవరు కావాలి. నాన్నయితే క్యాంప్ కెళ్ళారు. నాలుగురోజుల్లో వస్తారు. అమ్మైతే ఇప్పుడే వస్తుంది. గుడికి వెళ్ళింది.

"నేనెవరినని చెప్పను బాబు. రావటం అయితే మీ అమ్మ కోసమే వచ్చాను" ఆ మాటన్నది పసివాడితోనే అయినా లక్ష్మి కంఠం తడపడింది.

"అయితే కూర్చోండి". సోఫా చూపించి వంటింట్లోకి తుర్రుమన్నాడు. లక్ష్మి నిలబడే వుంది.

చెల్లాయిని కూర్చోపెట్టి రకరకాల ఆటబొమ్మలు దానిముందుంచాడు. అది ఆటలో పడగానే వాడు స్టౌ వెలిగించాడు. టీ కలిపి ఫ్లాస్క్‌లో పోసి చెల్లాయికి పాలు కలిపి సీసాలో పోశాడు. కాసిన్ని బియ్యం కుక్కర్లో పోసి వంటకూడా మొదలు పెట్టేశాడు.

చూస్తూ ఇక లక్ష్మి ఆగలేకపోయింది. " ఏం చేస్తున్నావ్ బుజ్జి నువ్వు"? వంటిట్లోకి తనూ వెళ్ళింది.

"మీరు హాల్లోనే కూర్చోండాంటీ. ఈ పన్లన్నీ నాకలవాటే." వాడి చురుకుతనానికి, ఆ ముద్దుమాటలకి ముచ్చటేసింది లక్ష్మికి. "అవున్లేకాని నేనొచ్చేశానుగా. ఇవన్నీ నువ్వెలాగు చేసేవ్. పోనీ కూర నేవండుతాను. ఫ్రిజ్‌లో ఏం కాయగూరలున్నాయ్ తెరవబోయింది.

ఆహా... వద్దు. వద్దు అమ్మ వచ్చేస్తుందిగా. నేను చెయ్యలేని పనులన్నీ కాస్త ఆలస్యమైన చేస్కుంటుంది. మన పనులు మనమే చేసుకోవాలంటుంది అమ్మ. ఎవరికైనా ఏ చిన్నపని చెప్పినా అమ్మకు ఎంత కోపమో! పాపం, మా అమ్మకు కాళ్ళు లేవు. అయినా కష్టపడి అన్ని పనులూ అమ్మే చేస్తుంది. అందుకే నేనూ నేర్చేసుకున్నా. అమ్మకు సాయం చేసాకే చదువుకుంటా. కానీ నేను స్కూలు ఫస్ట్ తెలుసా". గర్వంగా కళ్ళు తిప్పుతూ అన్నాడు.

వాడైతే గమనించలేదుగానీ, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న లక్ష్మికళ్ళలో నీళ్ళు నిండాయి. ఈ పసివాడిపాటి వివేకం తనకి లేకపోయింది. తమస్థితికి జాలిపడి, అభిమానంతో ఆదరించి

అక్షరభిక్షపెట్టి తనకో గమ్యం చూపించాలనుకున్న ఆ గొప్ప మనసుని అర్థం చేసుకోలేకపోయింది. ఆ తల్లిలో అవిటితనాన్ని చూసింది తప్ప విశాల హృదయాన్ని మంచితనాన్ని గుర్తించలేకపోయింది. ఆ తల్లి చల్లని నీడలో పెరిగి వుంటే తనకీ గతి పట్టేదా?

సరస్వతి తననేదో కష్టపెట్టేస్తోందని పంతానికి పోయి మూర్ఖుడైన తన తండ్రిని రప్పించి, ఆవిడని నానా మాటలు అనిపించి మరీ వెళ్ళిపోయింది. ఏం జరిగింది. తండ్రి మరింత అలుసుగా చూశాడు. కూతురు తన మాటకే తలవంచిందన్న అహంతో అమ్మ ఎంత పోరినా వినకుండా నిండా పదహారు ఏళ్ళులేని తనని ఒక టాక్సీ డ్రైవర్‌కిచ్చి పెళ్ళి చేసేశాడు. తనదీ అని ఓ ఇల్లు, భర్త, సంసారం జయించాననుకుంది. పరాయింట చాకిరి చేసి వాళ్ళుపెట్టే తిండి తినే అవస్థలు తప్పాయనుకుంది. తన కాపురం తన ఇష్టారాజ్యం, పొంగిపోయింది. ఓ నాలుగునెలలు గడిచేసరికి తనెంత పొరపాటు చేసిందో అర్థం కాసాగింది. తన మొగుడికి అన్ని వ్యసనాలు ఉన్నాయ్. ఎప్పుడోగాని ఇంటికి రాడు. వచ్చాడో నరకం చూపించేస్తాడు. పీకలదాకా తాగొస్తాడు. చేతిలో సిగరెట్టు ఒకటి ఆరేసరికి మరొకటి వెలుగుతూ ఉండవలసిందే. తన కోరికలు తీర్చుకోవటానికి పశువైపోతాడు ఆ మొరటుతనం ఈ పొగ, మందువాసన తను ఉక్కిరిబిక్కిరి అయిపోయేది. ఏమిటీ పాడలవాట్లు “మిమ్మల్ని చేసుకున్నప్పుడు నేనెంత ఆశపడ్డాను. బాగా సంపాదిస్తున్నారు. నన్నెంతో అపురూపంగా చూసుకుంటారని తనంటే, ఆ చెంపా, ఈ చెంపా వాయించాడు. “నోర్ముయ్యవే.. సంపాదిస్తున్నాను కనకే నీ మొహాన డబ్బు పడేస్తున్నాను. కూర్చుని తింటున్నది కాక నాకు నీతులు చెప్తావే. ఆ జ్ఞానం నీకు ముందే ఉండాలి. మీ నాన్నకి నా సంగతులన్నీ తెలుసు. నేనిచ్చే డబ్బుకి లోబడ్డాడు. నీ సొగసు, సోకు, చూసి నువ్వు నాకు కావాలన్నాను. కట్టబెట్టాడు.'' ఆ తప్పు తండ్రిది కాదు తనదే అనుకున్నది. ఆ జీవితానికే అలవాటుపడింది. ఓ అయిదేళ్ళ తర్వాత నెల తప్పితే ఈ ఆనందం చాలనకుంది. భర్త నిజ స్వరూపం అప్పుడు బయటపడింది. నువ్వు బిడ్డని కంటానికి నేనొప్పుకుంటాననుకున్నావా! ముందు కడుపు తీయించేసుకో నీకు చెప్పలేదా మీ నాన్న, నీకో సవితి, ముగ్గురు పిల్లలు ఉన్నారని.

ఆ మాట వింటూనే తనకి పిచ్చెక్కినంతపనైంది. ఎప్పుడూ మీ మాటకెదురు చెప్పలేదుకానీ బిడ్డను మాత్రం కనితీరతానంది. నే చెప్పినట్టు పడుండకపోతే నా ఇంట్లోంచి పో, అంటూ జుట్టు పట్టుకొని బయటకీడ్చాడు. అమ్మతో మొరపెట్టుకుంటే అనుభవించవే. నా మాట వినుంటే చదువు, సంధ్య నీ కాళ్ళ మీద నువ్వు నిలబడే దానివి కాదా! దేవతలాంటి అమ్మగారి సేవ చేసుకొని బాగుపడవే అంటే అదేదో కాని పని అన్నట్టు నా స్నేహితురాల్ని అవమానించి వచ్చేశావ్. మీ అన్నయ్యలు పెళ్ళిళ్ళు చేసుకున్నారు. అప్పటిలా నిన్ను చూడాలంటే ఎలా కుదురుతుంది. ఎవరి సంసారాలు వాళ్ళవి. నీ బరువు వాళ్ళమీద పడేసి నాకున్న అసరా పోగొట్టుకోలేనే నువ్వు చేసిన

పాపిష్ఠి పనికి నీ మొగుడు దగ్గరే అఘోరించు". తన స్నేహితురాల్ని తిరస్కరించినందుకు ఇన్నేళ్ళుగా పేరుకుపోయిన కోపం దుఃఖం కలగలపులుగా వస్తుండగా, గద్గదిక స్వరంతో కూతుర్ని చీవాట్లు వేసింది కమలమ్మ.

తనకి దిక్కు తోచలేదు. కుమిలికుమిలి ఏడ్చింది. తనప్పుడేం చేయాలి. ఎలా బ్రతకాలి. అమ్మన్నట్టు సరస్వతమ్మ నిజంగా దేవతే. తనని తప్పక ఆదరించే పెద్ద మనసు ఆమెకుంది. అలా అనుకునే ఇక్కడకొచ్చేసింది.

గతం నెమరువేసుకుంటూ కూర్చున్న లక్ష్మి ఉలిక్కిపడింది. ఒకప్పుడు భరించలేని మోతగా చిరాకు కలిగించిన ఊతకర్ర చప్పుడు, ఇప్పుడు చెవ్వుల్లో అమృతం చిలకరించింది. తన జీవితంలో ఏ మాత్రం తియ్యదనాన్ని పండించినా ఈ చల్లని తల్లే. సరస్వతి వచ్చింది, లక్ష్మిని చూసింది. ఆమె చెప్పిన దయనీయమైన కథవింది. అయితే చలించి పోలేదు. కన్నీరై కరిగిపోనూలేదు. తన ఆశలన్నీ ఆమె మౌనంలో ఆవిరైపోతుండగా లక్ష్మి అంది. "నా తప్పు క్షమించ తగ్గది కాదులెండి వెడతాను!" "నిన్ను వెళ్ళమనటం లేదు మాలాంటి వాళ్ళ గురించి నేను ఆలోచిస్తున్నాను. తప్పొప్పులు మాట ఎలా వున్నా మా వికలాంగులు అంటే అందరికీ చిన్నచూపే."

మీతో సహజీవనం చెయ్యాలని మేం ఎంతగా అనుకున్నా మీ ఆలంబనలేందే మా మనుగడ సాగదనుకుంటారు. ఒకరికొకరం తోడుగా మీ ప్రగతికి, మీకు సుఖమైన జీవనం అందించడానికి మేం చూపే కృషిలో మా స్వార్ధాన్నే వెతుకుతారు. నువ్వూ అంతే చేశావు. అది మా దురదృష్టం కానీ, నీ తప్పెలావుతుంది? మా వికలాంగులలో ఈ మోస్తరు వికలాంగుత్వం చూస్తునే ఉంటాము. నువ్వు ఇక్కడే వుంటావు. నా శక్తి వంచన లేకుండా నీ భవిష్యత్తు బాగుపడటం కోసం పాటుపడతాను. నువ్వు ప్రశాంతంగా బిడ్డను కని హాయిగా జీవించేట్టు బాధ్యత మనస్ఫూర్తిగా నా పైన వేసుకుంటున్నాను. నువ్వు నా ప్రియ స్నేహితురాలి కూతురివి. ఎప్పటికీ నీస్థానం నా హృదయంలో ఉంది." అంటున్న సరస్వతి పాదాలపై పడింది లక్ష్మి- సరస్వతీ నమస్తుభ్యం అన్నట్టు.

*అక్టోబర్ 20, ఆంధ్రభూమి మాసపత్రిక 2003* ❑